# సాక్షి
## అన్నమయ్య జిల్లా

శనివారం । 22 । జూలై । 2023

I




**ముగిసిన బలిజపల్లె గంగమ్మ జాతర**

రాజంపేట పట్టణ పరిధిలోని బలిజపల్లె గ్రామంలో గంగమ్మ జాతర వేడుకలు ముగిశాయి. -IIలో..



**చిత్తూరు జట్టు ఘన విజయం**

కడపలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్‌-19 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో చిత్తూరు జట్టు ఘన విజయం సాధించింది. -IIలో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.1080 | రూ.1200 |
| రెండోరకం | రూ.940 | రూ.1060 |



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 543 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

| రకం | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| బైవోల్టిన్ | 440 | 500 |
| సీబీ | - | - |



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 261.28 కిలోలు

## న్యూస్‌రీల్

### గడువు పొడిగింపు

రాయచోటిటౌన్ : టీచర్ ట్రైనింగ్ ( డీఎడ్) కోర్సు 2023–2025 సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల కోసం ఈనెల 26వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డైట్ ప్రిన్సిపల్ వై. రాఘవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. అయితే ఇంకా కళాశాలలో చేరని విద్యార్థుల కోసం గడువు మరింత పెంచినట్లు చెప్పారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె సిటీ: తెలుగు,వెలుగు సాహితీవేదిక సంస్థ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలు చేసిన వారికి జాతీయ పురస్కారాలు అందజేయనున్నట్లు రాయలసీమ రీజనల్ అధ్యక్షుడు గొల్లపూడి తిరుపతిరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 29న జరిగే తెలుగుభాషా దినోత్సవం పురస్కరించుకుని పురస్కారాలు అందజేస్తామన్నారు. సాహిత్యం, రచన, కవులు, కళాకారులు, సంగీతం, నృత్యం, భరతనాట్యం, కూచిపూడి కోలాటం, చిత్రలేఖనం, శిల్పం, నాటకం, జానపదం, మిమిక్రీ, ఉపాధ్యాయ, క్రీడలు, గ్రామీణాభివృద్ధి వంటి రంగాల్లో పనిచేస్తున్న వారు ఆగస్టు 10లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 910074351, 9441261585 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### గురుకుల క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు..

కడప రూరల్: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకులో గల గిరిజన సంక్షేమ గురుకుల క్రీడా పాఠశాల జోన్‌-4 పరిధిలో 5 , 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకో వాలని నెల్లూరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి తెలిపారు. 2022-2023 విద్యా సంవత్సరంలో గిరిజన గురుకులాలు, ఆశ్రమ, ప్రభుత్వ ప్రభుత్వ పాఠశాలల్లో నాలుగో తరగతి పూర్తి చేసుకొని 5వ తరగతి చదువుతున్న గిరిజన బాలురు అర్హులని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఈ నెల 27వ తేదీన తిరుపతి జిల్లా రేణిగుంట్ల ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎంపిక పరీక్షకు హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 96033 10648 నంబర్‌లో సంప్రదించాలని చెప్పారు.

### నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త చంద్రానాయక్

రాయచోటిటౌన్ : మంచి దిగుబడి ఇచ్చే నాణ్యమైన విత్తనాలను వాడాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి, కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్త చంద్రానాయక్ ( పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని స్పందన హాల్లో కేవీకే శాస్త్రవేత్తలు, పౌరసరఫరాల శాఖ అధికారులు, మిల్లర్లు, సహాయ వ్యవసాయ సంచాలకులు, అభ్యుదయ రైతులు, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థతో కలసి సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేస్తోందని తెలిపారు. 2024–2025 సంవత్సరానికి వరి విత్తనాల రకాల పంపిణీకి సంబంధించి అంచనా వేయడానికి కేవీకే కలికిరి శాస్త్రవేత్తలు వచ్చారన్నారు. రైతులు ఆర్‌ఎన్‌ఆర్ 15048, ఎన్‌డీఎల్‌ఆర్‌-7,బీపీటీ–5204, ఎన్‌ఎల్‌ఆర్ 34449, ఆవని, కేఎస్‌ఎం–1638 వంటి రకాలను ఉపయోగించి సాగు చేయాలని చెప్పారు.

### రైళ్ల రాకపోకల్లో మార్పులు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప మీదుగా నడిచే గుంటూరు–తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ను నాన్ ఇంటర్ లాంకింగ్ పనుల వల్ల తాత్కాలికంగా దూరాన్ని కుదించినట్లు కడప రైల్వేస్టేషన్ మేనేజర్ నరసింహారెడ్డి తెలిపారు. చీకతీగలపాలెం–శావల్యాపురం (వినుకొండ మండలం)ల మధ్య నాన్ ఇంటర్ లాంకింగ్ పనులు ఈనెల 31 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు జరగనున్నాయని తెలిపారు. అందులో భాగంగా గుంటూరు–తిరుపతి (17261) రైలును ఈనెల 31 నుంచి ఆగస్టు 2వ తేది వరకు, తిరుపతి–గుంటూరు (17261)ల మధ్య నడిచే రైలును ఆగస్టు 1 నుంచి 3వ తేది వరకు తిరుపతి–మార్కాపురం మధ్య మాత్రమే నడుస్తుందన్నారు.

### 23న సబ్‌జూనియర్ ఫుట్‌బాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడా మైదానంలో ఈనెల 23వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటలకు జిల్లాస్థాయి ఫుట్‌బాల్ సబ్‌జూనియర్ విభాగం బాలబాలికలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు వైఎస్‌ఆర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మామిడి సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. 01-01-2010 నుంచి 31-12-2011 మధ్య పుట్టినవారు ఈ ఎంపికలకు అర్హులన్నారు. ఎంపికలకు హాజరయ్యే వారు ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు వెంట తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9912020424, 99590 06388 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## ‘వైఎస్‌ఆర్ నేతన్న నేస్తం’
# చేనేతలకు అభయహస్తం

- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్
- ఐదో విడత ‘నేతన్న నేస్తం’ విడుదల
- జిల్లాలో 6937 మందికి రూ.16.64 కోట్ల మేర లబ్ధి

రాయచోటి : మగ్గానికి మహర్దశ తీసుకొచ్చి.. దేశంలో ఎక్కడా లేని విధంగా నేతన్నల జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నింపుతోందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. శుక్రవారం ఐదో విడత ‘వైఎస్‌ఆర్ నేతన్న నేస్తం’ను తిరుపతి జిల్లా వెంకటగిరి సభా స్థలం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, చేనేత,జౌళి శాఖ ఏడీ శ్రీనివాస్‌రెడ్డి, మట్లి సర్పంచ్ నాగార్జున, బీసీ నాయకులు విజయభాస్కర్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఐదోవిడత వైఎస్‌ఆర్ నేతన్న నేస్తంలో అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 6937 మంది చేనేతల ఖాతాలకు రూ.16.64 కోట్ల జమ అవుతుందని కలెక్టర్ చెప్పారు. వైఎస్‌ఆర్ నేతన్న నేస్తం పథకం చేనేతలకు ఆత్మీయ నేస్తంగా మారిందన్నారు. మగ్గం ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.



‘వైఎస్‌ఆర్ నేతన్న నేస్తం’ మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా తదితరులు

**మెగా చెక్ అందజేత**

అన్నమయ్య జిల్లాలో ఐదో విడత ‘వైఎస్‌ఆర్ నేతన్న నేస్తం’ పథకం కింద 6937 మంది లబ్ధిదారులకు రూ.16.64 కోట్లు మెగా చెక్కును జిల్లా కలెక్టర్, జేసీలు అందజేశారు. అగ్గిపెట్టెలో పట్టేటంతటి అతి సన్నని చీరలను అద్భుత నైపుణ్యం మన నేతన్నల సొంతం. దేశ విదేశాలలో పేరుగాంచిన మన మగ్గం క్రమంగా మూగబోయింది. మగ్గం స్థానంలో మరయంత్రం ప్రవేశించడం, ప్రభుత్వాలు నేత కార్మికులను క్రమంగా పట్టించుకోకపోవడంతో ఈ వృత్తి అంతరించే దశకు చేరుకుంది. మూలకు చేరిన మగ్గానికి పునర్ వైభవాన్ని కల్పించి,నేత కార్మికులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకమే ‘నేతన్న నేస్తం’. 2021 ఆర్థిక సంవత్సరంలో అన్నమయ్య జిల్లాలోని 5837 మంది నేతన్నలకు రూ.14.00 కోట్లు, 2022 ఆర్థిక సంవత్సరంలో 6118 మందికి రూ.14.68 కోట్లు జమ చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 6937 మంది నేతన్నలకు రూ.16.64 కోట్లు జమ చేసిన రాష్ట్ర ప్రభుత్వం జమచేసింది. దీంతో నేతన్నలలో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

**ఆర్థికసాయంతో ఆనందం**



20 సంవత్సరాల నుంచి మగ్గం నేస్తున్నాను. మగ్గం నేయకపోతే కుటుంబం గడవని పరిస్థితి. రోజంతా మగ్గం నేస్తే వచ్చిన సంపాదన పిల్లల చదువులకే సరిపోతోంది. సీఎం జగనన్న వైఎస్‌ఆర్ ‘నేతన్న నేస్తం’ పథకం ద్వారా యేటా రూ.24 వేలు ఇవ్వడం ఆనందదాయకం. 5వ విడతగా 24 వేల ఆర్థికసాయం ప్రభుత్వం మాకు అందజేసింది. నెలకు రూ.10 వేల వరకూ ఆదాయం వస్తుంది.

– ఎం.వెంకటేశ్వర్లు, మట్లి గ్రామం తొగటపల్లి, అన్నమయ్య జిల్లా

**చేనేతలకు అండగా సీఎం జగనన్న**



15 సంవత్సరాల నుంచి మగ్గం నేస్తున్నా. ‘వైఎస్‌ఆర్ నేతన్న నేస్తం’ పథకం ద్వారా ప్రభుత్వం అందజేసే రూ.24 వేలు ఆర్థికసాయం వల్ల మగ్గాలను అభివృద్ధి చేసుకొని మెరుగైన సంపాదన పొందేందుకు వీలుంటుంది. ఇచ్చిన హామీని జగనన్న నెరవేర్చుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన రెండు దఫాల డబ్బులతో మగ్గాలను బాగు చేయించుకున్నాను.నూలు, రంగులు కొనుగోలు చేసుకుంటున్నాను. నెలకు రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు ఆదాయం వస్తుంది.

– వీరభాస్కర్, మదనపల్లి, అన్నమయ్య జిల్లా

## తప్పులు లేని ఓటర్ల జాబితా
# రూపకల్పనకు సహకరించాలి

రాజకీయ పార్టీ ప్రతినిధులను కోరిన జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా సమావేశం నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పన, ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పులు, చేరికలపై సహకరించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ వివిధ రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 21వ తేదీ నుంచి నెలరోజులపాటు బీఎల్‌ఓలు ఇంటింటికి తిరిగి ఓటర్ల వివరాలను పరిశీలిస్తారన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల నమోదు పారదర్శకంగా చేపట్టి జాబితాలో చేర్చనున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి బూత్ స్థాయి ఏజెంట్లు కూడా పారదర్శక ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించాలని కలెక్టర్ సూచించారు. సుమోటోగా ఓటర్లను తొలగించడం కానీ, చేర్చడంగానీ ఉండదని, ప్రతి అంశాన్ని బిఎల్‌ఓలు జాగ్రత్తగా పరిశీలించి నమోదు చేస్తారన్నారు.

- 18 నుంచి 19 సంవత్సరాలలోపు యువ ఓటర్ల నమోదుకు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. ఓటర్లు జాబితాలో తమ ఓటు ఉందో లేదో చూసుకొని ఓటు లేకపోతే వెంటనే నమోదు చేసుకోవాలన్నారు.
- 2023, జూలై 20వ తేదీకి జిల్లాలో 668552 మంది పురుషులు, 685071 మంది స్త్రీలు, 136 మంది హిజ్రాలు మొత్తం 1353759 మంది ఓటర్లుగా నమోదయ్యారన్నారు. ప్రస్తుతం పోలింగ్ స్టేషన్లు 1577, బీఎల్‌ఓలు 1577 మంది ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికలు సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఓటరు జాబితా ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.
- ఉద్యోగుల సమస్యలను సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేకంగా జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు తమ సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.
- జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో ఆయన మాట్లాడుతూ ఈ కమిటీ ద్వారా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణకు కావాల్సిన పరికరాలు, కంప్యూటర్, మల్టీ ఫంక్షన్ డివైసెస్, యూపీఎస్, మొదలైనవి జిల్లాలోని 41 సంఘాల ఏకీకృతం కావడానికి అవసరమని రాష్ట్ర స్థాయికి నివేదిక పంపాలని సూచించారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి చిత్తూరు మరియు కడప, డీసీసీబీ సీఈఓలు, నాబార్డ్ డీడీఎం, చిత్తూరు మరియు కడప డీపీడీఎం, సొసైటీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు
- పరిసరాల పరిశుభ్రతపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ - 2023 లక్ష్యాలపై పోస్టర్లను శుక్రవారం కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో ఆయన ఆవిష్కరించారు. పారిశుధ్యం, పరిశుభ్రత పట్ల కమ్యూనిటీలలో అవగాహన కల్పించాలన్నారు. డీపీఓ ధనలక్ష్మీ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ -2023 లక్ష్యాలపై విజయవాడ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సూచనల మేరకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో వలంటీర్ల ద్వారా ఇంటింటికి పోస్టర్లను పంపిణీ చేయాలన్నారు.

# కాలుష్య కోరల్లో లోకోపైలెట్స్‌!

- ఆందోళనలో ఎల్‌పీజీ కుటుంబాలు
- అయిష్టంగానే విధుల నిర్వహణలో రన్నింగ్‌స్టాఫ్

రాజంపేట: గుంతకల్ రైల్వే డివిజన్ ఉన్నతాధికారులు అనాలోచిత నిర్ణయంతో ఆవిర్భావించిన ఎర్రగుంట్ల రైల్వే రన్నింగ్‌స్టాఫ్ క్రూ సెంటర్ కాలుష్యకోరల్లో చిక్కుకుందనే ఆరోపణలను రైల్వేశాఖ మూట కట్టుకుందని రైల్వేవర్గాలు బహిర్గతంగానే విమర్శిస్తున్నాయి. లోకోపైలెట్స్ ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉందని కార్మికవర్గాలు మదనపడుతున్నాయి. ధైర్యంగా ఉన్నతాధికారులు నిర్ణయాన్ని వ్యతిరేకించలేక, రన్నింగ్‌స్టాఫ్ క్రూసెంటర్ ఏర్పాటు ఎర్రగుంట్లలో ప్రతికూలమని తెలిసినా ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో రైల్వే డ్రైవర్లు కొట్టుమిట్టాడుతున్నారు. పరోక్షంగా ఎర్రగుంట్ల క్రూ సెంటర్ ఏర్పాటు వల్ల రైల్వేకి భారీగా నష్టమేనన్న భావన రైల్వే కార్మికవర్గాల్లో ఉంది.ఒక్కోసారి గూడ్స్‌రైళ్ల నిర్వహణ విఫలంకావడంతో ఎక్స్‌ప్రెస్‌రైళ్లకు గంటల తరబడి అంతరాయం కలుగుతోంది.స్థలం సమస్య, అదనపులైన్లు వేసుకునేందుకు వీలులేని దుస్థితి.

**లోకోపైలెట్ల ఆరోగ్యానికి పొంచి ఉన్న ముప్పు**

ఎర్రగుంట్ల రన్నింగ్‌స్టాఫ్ క్రూ సెంటర్‌లో పనిచేసే లోకోపైలెట్ల ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉందని రైల్వే కార్మికవర్గాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. కాలుష్యబెడద అధికంగా ఉందనే భయంతోనే కొందరు పనిచేస్తున్నారు. ఇటీవల నందలూరు రన్నింగ్ స్టాఫ్ క్రూసెంటర్ నుంచి కొంతమంది లోకోపైలెట్లు, అసిస్టెంట్ లోకోపైలెట్లను తీసుకెళ్లి బలవంతంగా విధులు చేయిస్తున్నారు. అయిష్టంగానే విధుల నిర్వహణలో రన్నింగ్‌స్టాఫ్ కొనసాగుతున్నారు.

**ఎర్రగుంట్లకు వెళ్లం**

ఎర్రగుంట్ల రన్నింగ్‌స్టాఫ్ క్రూ సెంటర్‌లో పనిచేయడానికి వెళ్లమని, రేణిగుంటకైనా వెళతామని బహిరంగగానే చెబుతున్నారు. అయితే డివిజన్ స్థాయి ఉన్నతాధికారి ఒకరు శాఖాపరమైన ఒత్తిడి తీసుకురావడం,లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరికలతో రన్నింగ్‌స్టాఫ్ బెంబేలెత్తిపోతున్నారు. కార్మికసంఘాలు మాత్రం నోరు మెదపడంలేదన్న విమర్శలున్నాయి



వివాదానికి కారణమైన ఎర్రగుంట్ల రన్నింగ్‌స్టాఫ్ క్రూ సెంటర్

**నందలూరుకేనా 200 కి.మీ నిబంధన...**

రైల్వేలో ఒక క్రూ డిపో ఏర్పాటుకు రైల్వేబోర్డు రూల్ ప్రకారం 200 కిలోమీటర్ల దూరం ఉండాలి. దీన్నే సాకుగా చూపుతూ నందలూరు–కృష్ణపట్నం మధ్య దూరం తగ్గిన కారణంగా నందలూరు క్రూ సెంటర్‌ను ఎత్తివేయాలనుకున్నారు. ఇక్కడ పనిచేసే ఎల్‌పీజీలను ఎర్రగుంట్ల సెంటర్‌కు బదిలీచేశారు. ఇది ఒక డివిజన్ ఉన్నతాధికారి ఎత్తుగడ అనే ఆరోపణలున్నాయి. అయితే ఎర్రగుంట్ల–గుత్తి మధ్య దూరం 110 కిలోమీటర్లు. అటువంటప్పుడు ఎర్రగుంట్లలో కూడా క్రూసెంటర్‌ను ఎలా ఏర్పాటు చేస్తారని రైల్వే మేధావి వర్గాలు అంటున్నాయి. ఒక వేళ ఎర్రగుంట్లలో క్రూసెంటర్ పెడితే రైల్వేబోర్డు నిబంధన మేరకు గుంతకల్లు, గుత్తిలో కూడా క్రూ డిపోలు ఎత్తివేయాలి కదా అని కార్మికవర్గాలు ప్రశ్నిస్తున్నాయి. రైల్వేబోర్డు, ఎమ్మార్ దృష్టికి తీసుకెళ్లే యత్నాలు.. రైల్వేకు నష్టం కలిగే విధంగా ఏర్పాటుచేసిన ఎర్రగుంట్ల లోకో రన్నింగ్‌స్టాఫ్ సెంటర్ ఏర్పాటు కారకులపై రైల్వేబోర్డు, మినిస్టర్ ఆఫ్ రైల్వేస్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. రైల్వేకు భారం కలిగించే విధంగా డివిజన్ ఉన్నతాధికారులు తీసుకుంటున్న నిర్ణయాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. నందలూరులో రైల్వేబోర్డు .. గుంతకల్‌రైల్వే డివిజన్ ఉన్నతాధికారులకు సంబంధం లేకుండా విచారణకమిటీ నిజాలను నిగ్గుతేల్చాల్సిన సమయం ఆసన్నమైందని రైల్వేకార్మిక వర్గాలు అంటున్నాయి.

**రైల్వేబోర్డు రంగంలోకి దిగాలి**



లోకోపైలెట్లకు సంబంధించి భద్రత, ఆరోగ్యం గురించి పట్టించుకోలేదు. ఎర్రగుంట్లలో పనిచేసేందుకు వారికి ఇష్టంలేదు. అధికారులు వేధింపులు తట్టుకోలేకపోతున్నారు. కాలుష్యం, తాగునీటితో ఇబ్బందులు పడుతున్నారు. నేరుగా రైల్వే బోర్డు రంగంలోకిదిగాలి. క్రూ సెంటర్ రైల్వే లాభం కోసం కాకుండా ఎవరో స్వార్థం కోసం ఏర్పాటుచేసినట్లుంది.

–షేక్ కమాల్‌బాషా, రిటైర్డ్ లోకోపైలెట్, నందలూరు

**200 కి.మీ నిబంధన అయితే గుత్తిడిపో ఎత్తివేయాలి**



గుంతకల్ రైల్వే డివిజన్ ఉన్నతాధికారులకు సంబంధం లేకుండా ఎర్రగుంట్లలో క్రూసెంటర్ ఏర్పాటు, నందలూరు క్రూసెంటర్ ఎత్తివేత నిర్ణయాలపై రైల్వేబోర్డు నేరుగా రంగంలోకి దిగివిచారణ చేయాలి. తప్పుడు నివేదికలతో నందలూరు రైల్వేను నిర్వీర్యం చేస్తున్నారు. 200 కి.మీ నిబంధన తీసుకుంటే ఎర్రగుంట్ల–గుత్తి మధ్య 110 కిలోమీటర్లే ఉంది. అప్పుడు గుత్తి క్రూ సెంటర్ కూడా ఎత్తివేయాలి ఈ విషయంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి ఉంది.

–ఫెజుల్లాఖాన్‌లోడి, జుడిషియల్ లోకాఅదాలత్ సభ్యుడు, నందలూరు

### స్టాఫ్ నర్స్ నియామక కౌన్సెలింగ్ ప్రారంభం



స్టాఫ్ నర్స్ నియామక కౌన్సెలింగ్ చేపడుతున్న మెడికల్, హెల్త్ ఆర్డీ అనిల్‌కుమార్

కడప రూరల్: కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్‌-4 పరిధిలో శుక్రవారం స్థానిక నూర్జహన్ ఫంక్షన్ హాల్‌లో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్‌ల నియామక కౌన్సెలింగ్ జరిగింది. గత అనుభవాల దృష్ట్యా అభ్యర్థుల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించారు. మొత్తం 313 పోస్టుల భర్తీకి గాను మొదటి రోజు 177 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి నియామక పత్రాలను అందజేశారు. మిగిలిన అభ్యర్థులకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలో పెద్ద ఎత్తున నియామకాలు చేపడుతోందన్నారు. స్టాఫ్ నర్స్‌లుగా నియమితులైన వారు వైద్య సేవలను అందించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరిండెంట్‌లు గోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బమ్మ సీనియర్ అసిస్టెంట్స్ అల్తావుల్లా, వినీష రాయలసీమ జిల్లాల నుంచి వచ్చిన అభ్యర్థులు పాల్గొన్నారు.

**గర్భిణులకు రక్తపరీక్షలు నిర్వహించాలి**

ప్రతి గర్భిణికి రక్త పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య సంరక్షణకు కృషి చేయాలని డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఇక్కడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు హిమోగ్లోబిన్ టెస్ట్ చేసే విధానంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌బీ మీటరు ద్వారా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఏ విధంగా టెస్టులు చేస్తున్నారో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్వాక్రా, పొదుపు సంఘాల గ్రూపులతో విలేజ్ హెల్త్ శానిటేషన్ కమిటీల ద్వారా సమావేశాలు నిర్వహించినప్పుడు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు.

# విధి నిర్వహణలో నైపుణ్యం చూపాలి

ఎస్పీ గంగాధర్‌రావు

రాయచోటి: ఎటువంటి విపత్కర పరిస్థితిని అయినా అంచనా వేసి చాకచక్యంగా ఎదుర్కొనేందుకు బి.డి. టీమ్ సిద్ధంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు పేర్కొన్నారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా పోలీస్ పేరెడ్ గ్రౌండ్‌లో బి.డి. టీమ్ 5 రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడ నుంచి విచ్చేసిన ఇంటలిజెన్స్ బృందం మెరుగైన శిక్షణ ఇచ్చారన్నారు. విధి నిర్వహణలో నైపుణ్యం చూపాలన్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. శిక్షణ సందర్భంగా నిర్వహించిన పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన బి.డి. టీమ్ సిబ్బందికి ప్రశంసాపత్రాలను ఎస్పీ అందజేశారు.కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి మహబూబ్ బాషా, జిల్లా అంగరక్షకుల ఇన్‌చార్జి రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎస్ జావిద్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసు సిబ్బంది నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ గంగాధర్‌రావు

- జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ ఆర్ గంగాధర్ రావు గ్రీవెన్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది సమస్యలపై వినతులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు.

**పోలీసు సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట**

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు అన్నారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని పేరెడ్ గ్రౌండ్‌లో సివిల్.ఎ.ఆర్, హోంగార్డ్ పోలీసు సిబ్బందికి నిర్వహించిన పేరెడ్‌ను ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఆరోగ్య విషయాలలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పేరెడ్‌లో ఉన్న ఏఆర్, స్పె.ల్ పార్టీ, హోంగార్డులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కారం చేసే దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు.

## క్లుప్తంగా

### గుర్తుతెలియని వ్యక్తి మృతి



రైల్వేకోడూరు : మండలంలోని కె.బుడుగుంటపల్లె పంచాయతీ అయ్యవారిపల్లె గ్రామ శ్మశానవాటిక సమీపంలోని రాళ్ళబండ కాలువ వద్ద శుక్రవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. చనిపోయిన వ్యక్తి వయస్సు సుమారు 50 నుంచి 55 ఏళ్లు ఉంటుందన్నారు. వివరాలు తెలిసిన వారు కోడూరు పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని పోలీసులు కోరారు.

### భూతగాదాలతో మహిళపై దాడి



దాడిలో గాయపడ్డ అశ్విని

కేవీపల్లె : భూతగాదాలతో మహిళపై దాడి జరిగిన సంఘటన మండలంలోని కేవీపల్లె పంచాయతీలో జరిగింది. బాధితుల కథనం మేరకు.. దిగువవగల్ల తాండాకు చెందిన రాజునాయక్, రమణానాయక్ అనే అన్నదమ్ములకు భూతగాదాలు ఉన్నాయి. శుక్రవారం పొలం వద్ద అన్నదమ్ములు ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో రమణానాయక్ కోడలు అశ్విని (25)పై రాజు నాయక్ కొడవలితో దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. ఆమెను చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జరిగిన సంఘటనపై అశ్విని భర్త దొరబాబునాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### ఆర్టీసీ బస్సు ఢీకొని ఛత్తీస్‌గఢ్ యువకుడి మృతి



మృతి చెందిన యువకుడు

కురబలకోట : ఛత్తీస్‌గఢ్ నుంచి బతుకుదెరువుకు వచ్చిన యువకుడు ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గురువారం రాత్రి మృతి చెందాడు. కురబలకోట మండలం నందిరెడ్డిగారిపల్లె వద్ద ఇటుక బట్టీల నిర్వాహకుడి వద్ద రాయపూర్ జిల్లా బడి గ్రామానికి చెందిన ధర్మేన్ (22) పని చేసేవాడు. ఇతడు గురువారం రాత్రి రోడ్డుపక్కన నడచివెళుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ముబీన్‌తాజ్ తెలిపారు.

## వైభవంగా ముగిసిన
# బలిజపల్లె గంగమ్మ జాతర

- ఊరేగింపుగా అమ్మవారిని పొలిమేర్లకు తరలింపు
- ఎదురు గుంభాలతో గంగమ్మను సాగనంపిన భక్తులు



గంగమ్మను ఊరేగింపుగా పొలిమేర్లకు తీసుకెళుతున్న భక్తులు

రాజంపేట టౌన్ : పట్టణ పరిధిలోని బలిజపల్లె గ్రామంలో గంగమ్మ జాతర వేడుకలు ఘనంగా ముగిశాయి. బుధవారం రాత్రి ప్రారంభమైన అమ్మవారి జాతర శుక్రవారం తెల్లవారుజామున ముగిసింది. భక్తులు అమ్మవారిని చేతులమీద ఊరేగిస్తూ వెళ్లి పొలిమేర్లకు సాగనంపారు. అమ్మవారిని ఊరేగించేందుకు భక్తులు పోటీపడ్డారు. ఊరేగింపు సందర్భంగా భక్తులు గంగమ్మకు అడుగడుగునా ఇష్టమైన నైవేద్యాలు సమర్పించారు. ఆసాదులు దారి పొడవునా అమ్మవారికి దీవెనలు ఇచ్చారు. ఈసందర్భంగా ఆసాదులు ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రముఖుల పేర్లను జోడించి కథలు చెప్పడం అందరినీ ఆకట్టుకుంది. ఆసాదులు చెప్పే కథ వినేందుకు భక్తులు ఆసక్తి చూపారు. జాతర వేడుక చివరి ఘట్టాన్ని తిలకించేందుకు పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.జాతరలో దాదాపు లక్ష మందికి పైగా భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు,నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. జాతర ప్రారంభమైనప్పటి నుంచి గురువారం అర్ధరాత్రి వరకు జాతరలో భక్తుల రద్దీ కొనసాగింది.

**కోటిన్నరకు పైగా వ్యాపారం**

ఈ ఏడాది జాతర ఆలస్యంగా జరిపినా గతంలో ఎన్నడూ లేని విధంగా భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు. వేలాది మంది భక్తులు జాతరలో అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. జనం భారీగా రావడంతో అన్ని రకాల వ్యాపారాలు జోరుగా సాగాయి. ముఖ్యంగా వందలాది మంది భక్తులు అమ్మవారికి పొట్టేళ్ళు, మేకపోతులు, కోడిపుంజులను సమర్పించారు. అలాగే జాతర రోజున దాదాపు భక్తులంతా మటన్, చికెన్ వంటివి కొనుగోలు చేశారు. జాతరలో సింహభాగం వ్యాపారం మాంసాహారాలకు సంబంధించి జరిగినట్లు వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

**పోలీసుల విశేష కృషి**

గత ఏడాది జాతర అంకురార్పణ సందర్భంగా చోటు చేసుకున్న ఘర్షణలు వంటి పరిణామాలను దృష్టిలో ఉంచుకొని డీఎస్పీ వీఎస్‌కే చైతన్య జాతర బందోబస్తుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. అర్బన్, రూరల్ సీఐలు నరసింహారావు, పుల్లయ్య, పట్టణ, రూరల్ ఎస్ఐలు ప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, భక్తవత్సలం జాతరను ప్రశాంత వాతావరణంలో జరిపించడానికి తమ వంతు విశేష కృషి చేశారు. జాతరలో పలువురు పిల్లలు తప్పిపోయారు. విషయాన్ని పిల్లల తల్లిదండ్రులు పోలీసులకు తెలియచేయగానే పోలీసులు మైక్ ద్వారా అనౌన్స్ చేసి తప్పిపోయిన పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగిస్తూ వచ్చారు.

# చిత్తూరు జట్టు ఘన విజయం

- అనంతపురం-కర్నూలు మ్యాచ్ డ్రా
- డబుల్ సెంచరీ సాధించిన సాయిసూర్యతేజారెడ్డి



తలపడుతున్న అనంతపురం, కర్నూలు జట్లు (ఇన్‌సెట్) డబుల్ సెంచరీ చేసిన కర్నూలు బ్యాట్స్‌మెన్ సాయిసూర్యతేజారెడ్డి

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్–19 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో చిత్తూరు జట్టు ఘన విజయం సాధించింది. కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో మూడోరోజు శుక్రవారం 144 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు 57.4 ఓవర్లలో 8 వికెట్ల వద్ద 206 పరుగుల వద్ద సెకండ్ ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. జట్టులోని మహమ్మద్ ఇర్ఫాన్ 56, భవానీప్రసాద్ 46, రెడ్డిరుషీల్ 48 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్ భార్గవ్ మహేష్ 4 వికెట్లు తీశాడు. అనంతరం సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 45 ఓవర్లలో 163 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని సుతేజ్‌రెడ్డి 53 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్ రాజ్‌దీప్ జతిన్ 6 వికెట్లు తీశాడు. దీంతో చిత్తూరు జట్టు 132 పరుగుల తేడాతో విజయం సాధించింది. కాగా చిత్తూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 341 పరుగులు చేయగా, నెల్లూరు జట్టు 252 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

**అనంతపురం జట్టు ఫస్ట్ ఇన్నింగ్స్ ఆధిక్యం**

వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ మైదానంలో జరిగిన అనంతపురం, కర్నూలు మ్యాచ్ డ్రాగా ముగిసింది. 148 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కర్నూలు జట్టు 110.4 ఓవర్లలో 388 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. కెప్టెన్ సాయిసూర్యతేజారెడ్డి 274 బంతుల్లో 28 ఫోర్లు, 6 సిక్సర్లతో 218 పరుగులు చేశాడు. అనంత బౌలర్ లోహిత్‌సాయికిశోర్ 4 వికెట్లు తీశాడు. అనంతరం సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు చివరిరోజు ఆట ముగిసే సమయానికి 14 ఓవర్లలో వికెట్ నష్టానికి 93 పరుగులు చేసింది. అర్జున్ టెండూల్కర్ 58 పరుగులు చేశాడు. ఫలితం తేలకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు 321 పరుగులు చేయగా, కర్నూలు జట్టు 175 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

## అక్కచెల్లెమ్మలకు
# జగనన్న బహుమతిగా రూ.10 లక్షల ఆస్తి

**టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్**



టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, టిడ్కో చైర్మన్

మదనపల్లె : టిడ్కో గృహాల నిర్మాణాలు జరుగుతున్న ప్రతి పట్టణంలో అక్కచెల్లెమ్మలకు ఉచితంగా ఇళ్లను అందిస్తామన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీ మేరకు అన్నదమ్ముడిగా రూ.10లక్షల విలువచేసే ఆస్తిని బహుమతిగా ఇస్తున్నట్లు ఎమ్మెల్యే నవాజ్‌బాషా, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తెలిపారు. శుక్రవారం మదనపల్లెలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా, టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్ పట్టణంలో టిడ్కో గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ టిడ్కో గృహప్రవేశాల కార్యక్రమం మదనపల్లె, పుంగనూరు పట్టణాల్లో ఆగస్టులో నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగానే పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. మదనపల్లెలో మొత్తం 1,872 ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తామన్నారు. ఒక్కొక్క గృహం విలువ రూ.10లక్షల వరకు అవుతుందని, ఇంతటి గొప్ప ఆస్తిని ఉచితంగా అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి అక్కాచెల్లెమ్మ ఆశీర్వదించాలన్నారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ.. టిడ్కో గృహాల్లో 300 చదరపు అడుగులకు టీడీపీ ప్రభుత్వ హయాంలో మొదట రూ.500 కడితేనే రిజిస్ట్రేషన్ చేసే వారని తెలిపారు. ఆ తర్వాత ఇంటికి రూ.2.62లక్షల అప్పు ఇప్పించి, దీనిని 20 ఏళ్లపాటు లబ్ధిదారులు నెలకు రూ.3వేల చొప్పున మొత్తం రూ.12లక్షలు చెల్లించాల్సి వచ్చేదన్నారు. చంద్రబాబు ప్రభుత్వం పేదలపై మోపిన ఈ భారాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తనపై వేసుకుందన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం కేవలం రూ.1కే టిడ్కో గృహాలను పేద మహిళలకు ఆస్తిగా ఇస్తున్నట్లు తెలిపారు. టిడ్కో గృహాల పరిశీలన అనంతరం ఎస్టీపీ ప్లాంటు ట్రయల్ రన్‌ను టిడ్కోచైర్మన్, ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, ఏపీ టిడ్కో ఎస్ఈ జాన్ సైమన్, ఈఈ పి.వెంకటముని, డీఈఈ బలరామయ్య, డీఈ శిరీష, ఏఈ స్నేహప్రియ, సీఎల్‌టీసీ ఎన్.లోకేష్, కౌన్సిలర్లు మేస్త్రీ శ్రీనివాసులు, ఆర్.వి.శివారెడ్డి, వసీం, భాను, సర్పంచ్ దండుకరుణాకర్‌రెడ్డి, పోతబోలునాగరాజ తదితరులు పాల్గొన్నారు.

# చిరుధాన్యాల సాగును పెంచాలి

**వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి**



సమావేశంలో పాల్గొన్న పంజం సుకుమార్ రెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రాయచోటి : జిల్లా వ్యాప్తంగా చిరుధాన్యాల సాగును విస్తృతం చేసేలా రైతులకు వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జిల్లా వ్యవసాయ సలహాబోర్డు చైర్మన్ అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహామండలి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఉపాధిహామీ పథకం తరపున మునగ ప్లాంటేషన్ ఏర్పాటు చేయాలని, మదనపల్లెలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆశించిన స్థాయిలో రైతులు పంటలు సాగుచేయలేయలేదని, ప్రత్యామ్నాయ పంటలకు సంబంధించి విత్తనాలు సబ్సిడీపై అందించాలని కోరారు. గ్రామాల వారీగా ఆర్బీకేల పరిధిలో వ్యవసాయ సహాయకులు సీజన్ల వారీగా ఆయా ప్రాంతాల్లో పండించే పంటలు, వాటికి ఆశించే చీడపీడలు, పైర్లకు అందాల్సిన పోషక విలువలు, ఎరువుల వాడకంపై ముందస్తుగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే నిర్వహించిన మండల వ్యవసాయ సలహామండలి సమావేశాల్లో చర్చించిన అంశాల ప్రతిపాదనలను గత జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశంలో బోర్డు సభ్యుల నివేదికలను పరిశీలించి బోర్డు వాటికి ఆమోదం తెలిపింది. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల పరిధిలో 40శాతం సబ్సిడీతో అందిస్తున్న డ్రోన్ పిచికారి యంత్ర పరికరాలను గ్రూపుల ద్వారా అందించే విధంగా వ్యవసాయశాఖ చర్యలు చేపట్టాలన్నారు. దీనికి డీఆర్‌డీఏ సహకరించి గ్రూపుల ద్వారా గ్రామాల్లో అందుబాటులో తెచ్చే విధంగా ప్రయత్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు దిన్నెపాడు రవిరాజు, బోదేషావలి, రవికుమార్ రెడ్డి, ఇరిగేషన్ అధికారులు, ఉద్యానశాఖ, మత్స్యశాఖ, పట్టు పరిశ్రమశాఖ అధికారులు, సహకార, వ్యవసాయ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## చదువుతో పాటు
# సామాజిక అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమశాఖ డీడీ జాకీర్ హుస్సేన్

రాయచోటి అర్బన్ : విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక అవగాహన అవసరమని సాంఘిక సంక్షేమశాఖ అన్నమయ్య జిల్లా డీడీ జాకీర్‌హుస్సేన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతిగృహం సముదాయంలో బాలికలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీడీ మాట్లాడుతూ చదువుతో పాటు మిగిలిన అన్ని అంశాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. అనంతరం రాయచోటి అర్బన్ మెడికల్ ఆఫీసర్ వసీమ్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించి విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, నివారణ చర్యలు, ఆరోగ్య సమస్యల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించి, చర్మ, వైరల్‌వ్యాధులకు సంబంధించి మందులు అందజేశారు. కార్యక్రమంలో రాయచోటి ఏఎస్‌డబ్ల్యూవో పి.రఘురామయ్య, హెచ్‌డబ్ల్యూవో శ్రీనివాసులు, శివారెడ్డి పాల్గొన్నారు.

## పూడ్చిన మృతదేహానికి
# 3 నెలల తర్వాత పోస్టుమార్టం

**కురబలకోట మండలంలో ఘటన**



పోస్టుమార్టం కోసం సమాధిని తొలగిస్తున్న దృశ్యం

కురబలకోట : ప్రమాదంలో చనిపోయిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీరు మృతదేహానికి 3 నెలల 10 రోజుల తర్వాత పోస్టుమార్టం నిర్వహించిన అరుదైన సంఘటన కురబలకోట మండలంలో శుక్రవారం జరిగింది. వివరాలు.. పిచ్చలవాండ్లపల్లె పంచాయతీ పందివానిపెంటకు చెందిన రేపన చౌడప్ప (33) బెంగళూరులోని విప్రో కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేసేవాడు. ఇతడికి భార్య శిల్ప, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 11న చౌడప్ప బెంగళూరు నుంచి మోటార్ సైకిల్‌పై ఇంటికి వస్తూ మదనపల్లె రూరల్ మండలంలోని చీకలబైలు వద్ద జరిగిన ప్రమాదంలో చనిపోయాడు. తీవ్ర విషాదంలో కూరుకుపోయిన కుటుంబీకులు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లకుండా పోస్టుమార్టం చేయకుండానే స్వగ్రామం పందివానిపెంటలో మరుసటి రోజు అంత్యక్రియలు నిర్వహించారు. అయితే చౌడప్ప సాఫ్ట్‌వేర్ ఇంజినీరు కావడంతో అతడి మృతి తర్వాత అందించే బెనిఫిట్స్ కోసం కంపెనీ పోస్టుమార్టం సర్టిఫికెట్ కావాలని కోరింది. చౌడప్ప భార్య శిల్ప స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ గంగాధరరావును కలసి తన భర్త చౌడప్ప మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి సర్టిఫికెట్ ఇప్పించాలని కోరింది. ఆయన ఆదేశాలతో శుక్రవారం మదనపల్లె డీఎస్పీ కేశప్ప ఆధ్వర్యంలో సీఐ సత్యనారాయణ, తహసీల్దారు ఎం. భీమేశ్వరరావు పర్యవేక్షణలో సమాధిని తొలగించి మృతదేహాన్ని బయటకు తీయించారు. అక్కడే వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. దానిని వీడియోలో చిత్రీకరించారు. మూడు నెలల తర్వాత మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్నారని తెలిసి పరిసర ప్రాంతాల ప్రజలు అక్కడికి పెద్ద సంఖ్యలో వచ్చారు.

## టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి 30 కుటుంబాలు చేరిక



పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు సమక్షంలో చిట్వేలి మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో చిట్వేలి మండలం కేవీ ఆర్‌పురం అరుంధతివాడకు చెందిన 30 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి కుల, మత, పార్టీలకతీతంగా నవరత్నాల ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. పార్టీలో చేరిన సుబ్బనర్సయ్య మాట్లాడుతూ ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. వీరు ప్రజలకు చేస్తున్న సేవలను, వైఎస్సార్‌సీపీ ప్రజలకు అందిస్తున్న అభివృద్ధి పథకాలకు ఆకర్షితులమై టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకేపాటి శంకర్‌రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, జిల్లా ఎస్సీసెల్ సెక్రటరీ నారాయణ, సర్పంచ్ ఆది లక్ష్మమ్మ, పెంచలయ్య, చిన్నయ్య, రమేష్, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.